కామమ్మ సహగమనము

శేషాద్రి రమణకవులు

౧

* ఇది నూరుసంవత్సరములక్రిందట యదార్థముగా జరిగినకథ. గోదావరిమండలములోని పిఠాపురమున బెస్తకుటుంబములు పెక్కులుగలవు. అందు సదాచారము, సద్వర్తనము, పాపభీతిగల సుకపల్లవారివంశము ప్రథమగణ్యము. ఆకాలమున వచ్చిన ఘోరక్షామవశమునఁ బేరొందిన లక్ష్మయ్య వెంకమ్మయను పుణ్య దంపతులు ఏండ్లునిండని పసికూనయగు కామమ్మనువిడిచి యిహలోకయాత్రముగించిరి. పెద్దతండ్రియగు రామన్నయుఁ బెద్దతల్లియగు వెంకమ్మయు సుతనిర్విశేషమగు ప్రేమతోఁ గామమ్మనుబెంచి పెద్దదానిని గావించిరి.

కామమ్మ కులమునఁ బేదరాలైనను గుణమున సాటివారిలోమిన్న. తలిదండ్రులతోఁ బాటు పొలము పనులలోఁ బాల్గొనుచుఁ బెద్దలకడఁ బురాణకథల నాలించుచు వీలైనపుడు చిన్నిపుస్తకములుచదువుచుఁ జిన్న తనముననే కామమ్మ గుణవతియని పేరొందెను. తలిదండ్రులులేనిబిడ్డయనియు, గుణవతియనియు, రూపవతి యనియుఁ దోడివారామెనుగూర్చి గారాబమునఁ జెప్పుకొనుచుండిరి. కులవృత్తినెఱుంగక సేవాధర్మములతోఁ గాపురముజేయు నేమర్యాదస్థునకేని కామమ్మ నొసంగవలయునని తలిదండ్రులు తలంచిరి. అనురూపవయస్కుఁడు, సుస్వరూపి, మేనల్లుఁడునగు మారయ్యకుఁ గామమ్మనొసంగి మహావైభవముగఁ బెద్దతండ్రి వివాహము గావించెను. ఆవివాహసమయమునఁ గామమ్మకుఁ బదియేండ్లునిండెనో లేదో చెప్పఁజాలము. అవ్యాజమగు ప్రేమతో, అవ్యక్తమగులజ్జతో, అనన్యమగు నానందముతో నాదంపతులు సంసారబంధబంధితులైరి. సిగ్గెఱుఁగని కామమ్మ చిఱునగవుమొగముతో మారయ్యనుజూచి మహోత్సాహముతో డేగాటయందును, బంతులాట యందును, దాగిలియందును మిన్ననైతినని వాలుచూపులతో భావప్రకటనముగావించును. వివాహానంతరము దంపతులిరువురు తమతమ గృహములకుఁజేరి భవిష్యదానందజీవితార్థులై కాలముగడుపుచుండిరి.

౨

సామర్లకోటలోనున్న బెస్తకుటుంబములలో మారయ్యకుటుంబము చాలగౌరవపాత్రమైనది. తరతరములనుండి యీవంశజులకు సేవకవృత్తియే జీవనము. కన్నులుదెఱవని పసికూనలగు మారయ్యను రెడ్డెయ్యను బోషింపలేక వారితండ్రి మదరాసునకుఁ గొలువుచేయబోయి యచటనే గతించెను. నాటనుండి తల్లియగు చెల్లమ్మ కూలినాలిజేసి బిడ్డలను బెద్దవాండ్రగావించి తగిన సంబంధమని యన్నకూతురగు కామమ్మనిచ్చి మారయ్యకుఁ బెండ్లిగావించెను. మారయ్యనెట్లో యొకయింటివానినిగావించి గంపెఁడుబలగములో విడిచి తిని. రెడ్డెయ్య చిన్నవాఁడు. వానిసంగతి యన్నయే విచారింపఁగలడని చెల్లమ్మ తృప్తినొందెను. తల్లి పెద్ద

---

* కామమ్మకథయను గేయముననుసరించి యీకథ వ్రాసితిమి. గేయకర్తనామము తెలియదుగాని యిది యథార్థచరిత్రమనుట కనేకాధారములు గలవు. కథయందలి వ్యక్తుల సమన్వయించి చారిత్రరూపమున నీకథను సమర్థింపవలసియున్నది. సావకాశముగ నాపని నింకొకమాఱు జరుపఁదలచితిమి. కామమ్మకథవలె నాంధ్రనారీమణులగు లక్ష్మమ్మ, బాలనాగమ్మ, చిన్నమ్మ, తిరుపతమ్మ, నూకలమ్మ, ముసలమ్మ మున్నగు సాధ్వీమణుల కథలుగూడ గేయగ్రంథములనుండి పిడిదీసి చరిత్రానుకూలముగఁ గథారూపమునఁ బ్రకటించుట యత్యవసరము. ప్రజాభిరుచిననుసరించి యీపనికిఁగ్రమముగఁ బూనుకొందుము.

తనమునఁ గూలినాలికిఁబోఁజాలదని మారయ్యాయే కుటుంబభారమువహించెను. ఒకదినమున కాకినాడకుఁ బోయి మారయ్యా కలక్టరునుజూచి తనకు బంట్రోతుపని దయచేయింపుమని కోరెను. నెలకు మూఁడువరహాల జీతముతో మారయ్యాను కలక్టరు తనవెంటనుండు బంటుగాఁదీసికొనెను. స్వల్పాదాయముతో నొకపూట గంజిద్రాగి మిగిలిధనము కుటుంబమునకుఁబంపుచు నిలువుజీతపుఁజాకిరి యెన్నిదినములుచేసినను కలక్టరునకు మారయ్యాయెడఁకనికరముగలుగలేదు. ఒకదినమున మాటపట్టింపుమీఁద కలక్టరు మారయ్యాను దుర్భాషలాడెను. అగౌరవపుబ్రతుకు నొల్లక వెంటనే మారయ్యా తన యుద్యోగమునకు రాజీనామయిచ్చి తనకు రావలసిన యాఱునెలల జీతముగైకొని యిల్లుచేరెను. నాలుగుదినము లింట కాలముగడిపి మారయ్యా తల్లియగు చెల్లమ్మదగ్గఱకుఁబోయి అమ్మా! కాకినాడనౌకరిమానుకొంటిని. తెచ్చిననాలుగురూకలు కర్చుపడుచున్నవి. ఇపుడే వేఱొకనౌకరి వెదకుకొనవలసియున్నది. చెన్నపట్టణమునకుఁబోయి నేను పటాలములోఁజేరెదను. పంపుమని ప్రార్థించెను. చెల్లమ్మ బొటబొట కన్నీరుగార్చి తండ్రీ! నిన్నువిడిచి నేనుబ్రదుకగలనా? చెన్నపట్టణపునౌకరి మనకచ్చిరాదు. మీనాయన నౌకరికిఁబోయి చెన్నపట్టణములోనె చనిపోయినాఁడు. అందుచే మనము దిక్కుమాలినపక్షులమైతిమి. కాన నీప్రయత్నము మానుకొమ్మని మారయ్యాను బతిమాలెను. మారయ్యా పట్టినపట్టువిడువలేదు. విధిలేక తల్లియంగీకరించెను. అప్పుడు మారయ్యా ఒకతులసిమొక్కనుదెచ్చి తల్లికిచ్చి అమ్మా! నాపేర నీమొక్కనునాటి పోషింపుము. ఇది వృద్ధినొందిన నే క్షేమముగనుంటిననుకొమ్ము. ఎండిపోయెనా నేను మరణించితిననుకొమ్మని గుర్తుచెప్పి చెన్నపట్టణమునకుఁ బయనమయ్యెను. తల్లి బాష్పదృష్టితోఁ గుమారునిపంపెను. తమ్ముఁడగు రెడ్డెయ్య కాకినాడవఱకువచ్చి యన్నయగు మారయ్యాను పొగయోడయెక్కించి విచారముతో వెనుకకుమఱలెను.

3

మనకథాకాలమునాఁటికిఁ బొగబండ్లులేవు. పడవప్రయాణమునఁ గొన్నాళ్లకు మారయ్యా చెన్నపురి చేరి పెద్దనాయనిపేటకుఁబోయి జోడునిమ్మపండ్లుగొని వాలీను, మేలీను అనునిరువురు తెల్లదొరలను సందర్శించెను. వారు మారయ్యాకులశీలములవిచారించి యిరువదిమందిబోయిలపైఁ పెద్దబోయిగ మారయ్యాను నియోగించిరి. నెలకైదువరహాలు జీతము. పొట్టకుఁబట్టకుఁబోను మిగిలినరొక్కము సామర్లకోటకుఁబంపుచు మారయ్యా ఎటులో ఐదేండ్లుగడిపెను. చిరకాలప్రవాసముచే శుష్కించినఁదనహృదయమున జిగురుబుట్టునను నాశతో మారయ్యా సామర్లకోటకేగఁదలంచి తమ యజమానుల సెలవడుగ వారు శ్రీరంగపురము బెంగుళూరులు ముట్టడులుముగిసినపిదపఁ గానియింటికేగ వీలుగాదనిరి. విధిలేక బెంగుళూరు ప్రయాణముముగించుకొని మారయ్యా యధికారుల సెలవుకోరెను. దుబాసి చెంగయ్యా మారయ్యాకురావలసిన ఆఱునెలలజీతమునిచ్చెను. మారయ్యా బజారునకుఁబోయి తల్లికి బొమ్మంచుచీరె, తమ్మునకు బొమ్మంచుచాపు, భార్యయగు కామమ్మకు అద్దాలరవిక, నిమ్మపండ్లచాయరవికగొని గృహోన్ముఖుండాయెను. చేతిలోనిరొక్కము కర్చుపెట్టఁజాలక మారయ్యా కాలిబాటను బయలుదేరి యిరువదినాలుగవదినము సాయంకాలమునకు కాకినాడఁజేరెను. నాఁడు మారయ్యాకు అఖండముగా జ్వరమువచ్చెను. కడుపునొప్పి యెక్కువయయ్యెను. ఉపచారములుచేయు దిక్కులేదు. ఎటులో మూఁడులంఘణములుజేసి నాలుగవనాఁడు మారయ్యా సామర్లకోటచేరి తానుదెచ్చినధనము తల్లికప్పగించి మంచమెక్కెను. దినదినము మారయ్యాస్థితి యపాయకరముగ మారుచుండెను. ప్రాణముల యాసవదలి యంత్యసమయమునఁ దనయర్ధాంగలక్ష్మియగు కామమ్మను జూడదలంచితినని మారయ్యా తల్లితో విన్నవించెను. కుమారుని దురవస్థకుఁజింతిల్లు చల్లమ్మ తన యసహాయస్థితికేని జంకక వెంటనే చిన్నకుమారుఁ

డగు రెడ్డెయ్యానుబిలిచి, కుమారా! మీయన్న మారయ్యా మిగుల నపాయస్థితిలోనున్నాఁడు. ఒకమాఱు కామమ్మను జూడఁదలంచినాఁడు. ఆయమ పుట్టినింటనుండి వచ్చువఱకేని మారయ్యా బ్రతుకుననునాశ నాకు లేదు. ఐననేమి? నీవు పిఠాపురమునకుఁబోయి మీవదినెకీసంగతి తెలిపి వెంటగొనిరమ్మని పలికెను. రెడ్డెయ్యా గుండెలదరెను. మరణావస్థకుఁ జేరువలోనున్న మారయ్యానువిడువలేఁడు. తల్లిమాట జవదాటజాలఁడు. రెడ్డెయ్యా తనలో "మావదినెను ఏమివేడుకయని పిలుచుకొనివచ్చెదను. ఆమెకు అన్నయ్యాదురవస్థ నెటుల విన్నవించెదను." అనుకొనుచు చద్దికట్టుకొని పెందలకడలేచి పిఠాపురమునకుఁ బయనమాయెను.

౪

రెడ్డెయ్యా మఱునటిదినము సాయంకాలమునకుఁ బిఠాపురముజేరి వీథిలో మామయగు రామయ్యానుగలసికొని తనయగ్రజుఁడు వ్యాధిపీడితుఁడై మరణశయ్యయందుండుటఁదెలిపి వదినెయగు కామమ్మను బంపుమని కోరెను. వారిరువురు మాటలాడుచు నింటికివచ్చుసరికి కామమ్మ గతరాత్రమునఁదనకు భర్తృవియోగము తటస్థించినటులఁ గలగన్నందులకుఁ బరితపించుచు నేకాంతగృహముననుండెను. వీరిరువురు కామమ్మనుదరిసి స్థితినెఱింగించిరి. కామమ్మహృదయము చెదరిపోయెను. కల సత్యమయ్యెను. ఏనాఁడో పెండ్లిపీటలమీఁద దక్క భర్తను మరలజూచియెఱుఁగదు. అవశిష్టములుతీరినవి. ఇఁకభర్తయింటిలోఁగాలము సుఖముగా గడుపుదమనుకొనుసరికి బిట్టపిడుగువలె నీచిక్కుతటస్థించెను. కామమ్మగడగడవణకి తండ్రితోఁ దన్నుఁబ్రయాణము చేయమనెను. రామయ్యా విధిలేక యంగీకరించి పెద్దకోమటియింటికేగి యేఁబదివరహాలు ఋణముదెచ్చి కామమ్మకు కోటబొమ్మంచుచీర, అందమైనరవిక, పెద్దకంచము, చెంబు, నత్తు, బన్నెసరము, పాపటబొట్టు కొని సారెకొఱకుఁ గావలసిన ఫలాదులు భీమవరపుసంతలోఁగొనితెచ్చి కుమార్తెకొసంగెను. సారెలన్నియు సంతరించి మఱునాఁడు కామమ్మ పయనము కాఁబోవుసరికి అపశకునములెన్నియో యాయెను. ఇవియన్నియుఁ లక్ష్యపెట్టినలాభములేదనియు, భవితవ్యము కాకమానదనియు గుండెదిటవుజేసికొని పెద్దలకు నమస్కరించి కామమ్మ అత్తవారింటికి బయలుదేరెను. బంధుగులందఱు చాలదూరమువచ్చి కామమ్మను వీడ్కొలిపిరి. కామమ్మ ప్రయాణాయాసమునను‌భవించుచు నత్తవారింటికిరాఁగా చూడవచ్చినవారు తుమ్మిరి. వెంటవచ్చిన సారెకావడుల నింటదింపించి తెచ్చినసారెలోఁ గొంత యత్తగారికొసంగి కామమ్మ భర్తక్షేమమునుగోరి మఱునాఁ డట్లతద్దెనోమునోఁచెను. శాస్త్రవిధిననుసరించి వ్రతము సక్రమముగా నిర్వహించి వ్రతకథవిని యక్షుతలుగైకొనుసరికి ఇంటిలోఁగొల్లుమనిరి. కామమ్మ ఇంటిలోనికివచ్చి చూచుసరికి మారయ్యా కవసానము చేరువయయ్యెను. కనులుతిరిగిపోయెను. కామమ్మ యాదుస్థితిఁజూచి నిలువునీరై యిట్లుపలవించెను: 'ప్రాణేశ్వరా! ఈడుజోడుగ నుందుమనుకొంటిని. ఈడుజోడురూపుమాపి మరణించితివా? పాపపుబ్రహ్మ మనబ్రదుకు పాడుజేసెగదా! నాకంకణముగట్టినసామీ! పుట్టినింటనైదేండ్లనుండి పడియుంటినేగాని యెన్నఁడు నీయందఁ జేరనైతిని. ఇంక నాకుగతియేది?" కామమ్మయేడ్చి ఫలమేమని ధైర్యముదెచ్చుకొని దొడ్డిలోనికేగి తులసితెచ్చి బంధువులఁబిలిచి భర్తనుభూశయనముగావించి నారాయణస్మరణగావించుచుఁ దులసితీర్థము విడుచుచుండఁగనే మారయ్యా మరణించెను. రెడ్డెయ్యా చల్లమ్మ నేలబట్టియల్లాడసాగిరి. కామమ్మ కొంచెము నిర్ఘాంతపోయినట్లు పడి తెప్పరిల్లిలేచి 'అత్తా! విచారింపకుము. మఱఁదీ! యేడ్చిననేమిఫలము? చచ్చినవారురారు. ఊఱడిల్లు'మని బుజ్జగించెను. అనంతరము కామమ్మ భర్తతోసహగమనముగావింప బంధువులననుజ్ఞవేఁడెను. రెడ్డెయ్యా వదినెనుజూచి అమ్మా! కామమ్మా! చచ్చినవారితోఁ జావఁగలమా! మాయన్నను బెండ్లాడితివెగాని సంసారసౌఖ్యములనుభవించి యెఱుఁగవు. నిన్నుమేము అన్నకుమాఱుగాభావింతుము, నీకన్నవస్త్రములకుఁ గొఱతఁ రానీయము. ఈవెఱ్ఱిసహగమనయత్నము మానుకొమ్మని బుజ్జగించెను. కామమ్మ రెడ్డెయ్యామాటలు సరకు

గోళక విధవనై బ్రదుకఁజాలను. నేఁడు సాగకున్నఁ బదిసంవత్సరములకేని గుండమునఁ బడకమాననని స్పష్టముగాఁ జెప్పెను. బంధువులు బదులుచెప్పనోపక కామమ్మనుజూచి అమ్మా! ఇదికంపినీవారి పరిపాలనము. కాకినాడలోని కలక్టరు, సామర్లకోట కెప్టెను అనుజ్ఞయిచ్చినఁగాని సహగమనము జరుపవీలుండదు. ముందు సెలవు సంపాదింపుమని పల్కిరి. బ్రదుకుదానికి భయముగాని చావఁబోవుదానికేమి భయమనిపలికి రాణి నాగమ్మగారిసెలవు బడయ రాజమందిరమునకు కామమ్మ బయలుదేరెను.

౫

తొలుత కామమ్మ సామర్లకోటరాజ్యమునకు రాణిగానున్న నాగమ్మదొరసానిని దర్శించి సహగమనమునకు అనుజ్ఞయిమ్మని ప్రార్థించెను. ఆమె కామమ్మను బుజ్జగించి చచ్చినవారితోఁ జావఁగలమా? నీమఱఁదియగు రెడ్డెయ్యను మాఱుమనుముగట్టుకొనుము. నీమగనిజీతమాతని కిప్పించెదను. రెండుకత్తులభూమి ఈనాముగా నిప్పించెదను. నామాటవిని సహగమనయత్నము మానుకొమ్మని నిర్బంధించెను. కామమ్మ యందులకు నుండిపడి "దొరసానీ! మాకులమున మాఱుమను మేనాఁడును లేదు. నీది మాఱుమనుముకులము. ఏడు మాఱుమనుములు మీకుఁగలవు. కాన నవసరమైనచో నీకూతురు రుక్మిణిని నామఱఁదికి మాఱుమనముగట్టుము. అంతియగాని నాకీదుర్బోధ చేయకుము. ఫలమనుభవింతువని పల్కెను. అంతలో రాణికి అఖండముగఁ గడుపునొప్పివచ్చి తన్నుకొనుచుఁ గామమ్మను శరణుగోరఁగా నామెకరుణించి వ్యాధినివారణముగా ననుగ్రహించెను. అంత నాగమ్మ సహగమనమున కాజ్ఞ చెన్నపట్టణములోనున్న దొరలీయవలసినదెగాన పోయి తెచ్చుకొమ్మనిచెప్పెను. కామమ్మగృహముచేరి భర్తృశవమునకు వలయునుపచారములు పూజాపురస్కారములు గావించి ఇంటిలో నొకమూల పదిలముగా శవమునుంచి మండలాధికారియనుజ్ఞ వడయుటకు కామమ్మ కాకినాడకు బయలుదేరెను. మఱేఁది, తక్కువగలచుట్టములు కామమ్మవెంట కాకినాడకుఁ బయనమైరి. అట్లుతద్దకు వానలుకురియుటకలదు గావున నాడుమహావర్షముకురిసెను. భీమవరపుకాలువపొంగి పాఱుచుండెను. తన పాతివ్రత్యమాహాత్మ్యమున ఈతనెఱుంగని కామమ్మయేరుదాటెను. వెంటవచ్చినబంధువులును ఈది యేఱు దాటిరి. ఏడుగడియలప్రొద్దెక్కుసరికి కామమ్మ పరిజనసహితముగా కాకినాడచేరెను. నెల్లుమనే కలక్టరు బంగళావద్దకుఁబోవ దుబాసి సోమన్నయెదురుగావచ్చెను. కొంతసేపటికి దుబాసి చెంగయ్యవచ్చి కామమ్మ వచ్చిన వృత్తాంతము నాలకించి కలక్టరునకు నివేదించెను. కలక్టరు సహగమనవార్తవిని యాశ్చర్యపోయి కామమ్మను పిలువనంపఁగా నామె యిట్లుచెప్పెను:"దొరగారూ! నాభర్త మారయ్య గతించినాడు. ఆతనితో నేను సహగమనముగావింప నిశ్చయించితిని. సహగమనముకొఱకు రెండిండ్లస్థలము నాకిప్పింపవలయును, సహగమనము మాకు దేశాచారము, రెండునిలువులలోతున గుండముత్రవ్వి అందుఁగలపవేసి తగులఁబెట్టి నూఱుసిద్దెలు కుమ్మరింతురు. అందు దూకుటయే సహగమనము. మాకులాచారమగు నీసహగమనమునకు సెలవిండు."

కామమ్మ కోరికను కలక్టరు తృణీకరించి నీవుమాఱుమనుము కట్టుకొమ్ము, వివాహమునకగుకర్చులిచ్చెదనని పల్కెను. కామమ్మ కోపించి చెవులుమూసికొని దొరా! నీవుచచ్చినచో నీభార్యను మాఱుమనుముగట్టుకొమ్మనుమా. నీకూతురుకు మాఱుమనుము కట్టుము. నాకుఁజెప్పుటకు నీవెవఁడవు? శక్తియున్న సహగమనమున కాజ్ఞయిమ్ము. చేతగాకున్న చచ్చినటులుండుము. మించిమాటలాడిన నీతల బద్దలైపోవునని పలికెను. కలక్టరామె సాహసవాక్యముల కదరిపడి వత్సవాయి తిమ్మరాజుకంటె నీమె యధికురాలా? వన్నెంతమాటలడిగినదని కోపించి కామమ్మను పారాలోనిలువఁబెట్టించెను. కామమ్మ ఏడుదినములుపవాసముతో పారాలో నేయుండెను. ఆమెదేహము మిసమిసలాడుచు నూతనకాంతితో నుల్లసిల్లెను. ఇదియంతయుఁజూచి కలక్ట

రాశ్చర్యపడి రెడ్డయ్యానుపిలిచి మారయ్యాశవ మేమైనదియనియడుగ నాతఁడు వదినె కామమ్మయానచొప్పున నింటదాచితిమని చెప్పిరి. వెంటనే కలక్టరు సామర్లకోటలోనున్న కొత్వాలు నరసయ్యాకుఁ దనదుబాసిచేత మారయ్యాశవమును దహనము చేయింపుమని యాజ్ఞాపత్రము వ్రాయించిపంపెను. కొత్వాలు నరసయ్యా జాబు చూచి కామమ్మయిల్లు పగులగొట్టించి మారయ్యాశవమును బయటికిఁదీయించెను. నాటి కిరువదినాలుగురోజులు దాటినను కామమ్మ పాతివ్రత్యమహత్త్వమున శవము యథావిధిగానుండెను. తత్క్షణమె కొత్వాలు నరసయ్యా గ్రామవాసులసహాయముతో మా[illegible]య్యా కళేబరమునకు యథావిధిగ నగ్నిసంస్కారము గావించెను.

౬

సామర్లకోటలో భర్తశవమునకు అగ్నిసంస్కారము జేయుసమయమునకుసరిగా కాకినాడలో కామమ్మ నిర్జీవయయ్యెను. వైద్యులు పరీక్షించి మరణించినటుల నిశ్చయించిరి. దీర్ఘోపాసవశమున మరణించి యుండనోపునని కలక్టరుభావించి కామమ్మ కళేబరమును బంధువుల కధీనముగావించుచు జీవముండి బ్రతికిన సరి. మరణించినచో మారయ్యాకళేబరముతో జతపఱచి దహింపుఁడని చెప్పెను. కామమ్మ యకాలమరణమునకుఁ బరితపించుచు ఆత్మబంధువు లామె దేహమును సామర్లకోటకు మోసికొనివచ్చుచు మార్గమధ్యమున మూఁడుక్రోసులదూరముననున్న కొప్పెరసోమన్నగుడియొద్దకుఁ జేరుసరికి కామమ్మ కెవ్వునఁగేక వేసి లేచి కూర్చుండెను. బంధువు లాశ్చర్యపడి చూచుచుండ కామమ్మ యిట్లుచెప్పెను: "బంధువులారా! నాయాత్మ పరలోకమునకేగి మారయ్యానుజూచి యిపుడె బొందిలోఁజేరినది. నేను సహగమనముగావింప నావిభుఁ డాజ్ఞాపించినాఁడు. త్వరగ సామర్లకోటకుఁ బయనముకావలయును." ఇట్లు కామమ్మపలికి యాగ్రామాధికారియగు పాపయ్యాకు వర్తమానముజేసి సహగమనకుండిక నేర్పఱుపఁగోరెను. తానుకుంటివాఁడననియు, ఆఱుసంవత్సరములనుండి నడిచిరియెఱుఁగననియు, దొరతనమువారిసెలవుకావలయుననియు బదులుచెప్పిపంపెను. కామమ్మ దొరతనమువారిసెలవు తెప్పింపగలననియు నీకాళ్లుత్వరలో రాఁగలవు సహగమనము జూడరమ్మనియుఁ బాపయ్యాకువర్తమానముజేసి సామర్లకోటకుజేరెను.

సామర్లకోట గ్రామబహిర్భాగమున మారయ్యాకాష్ఠము కాలుచుండెను. సాధ్వీరత్నమగు కామమ్మ కాష్ఠముచుట్టు మూఁడుమాఱులుదిరిగి ప్రదక్షిణముముగించి మంటనొకజాము కౌఁగిలించుకొనెను. ఆశుభసమయమున కామమ్మనోటనుండి యప్రయత్నముగ నీమధురవాక్యరత్నములు బహిర్గతమయ్యెను:

"ఎంతచక్కఁగనుండె నీపూలవనము
ఎంతబాగానున్న దీజాజివనము."

కామమ్మా! నీవు లోకోత్తరపుణ్యమూర్తివి. భర్తృసేవాపరతంత్రమగు నీజీవితము ధన్యము. త్యాగభూయిష్ఠమగు నీయాచరణము పరమపవిత్రము. ఆంధ్రజాతిత్యాగధురంధరమై తలయెత్తుటకు నీవంటి వీరకాంతారత్నముల దివ్యాశీర్వాదములేగదా ప్రధానకారణములు?

భర్తృచితికి నమస్కరించి కామమ్మయందుండి కొన్నియగ్నికణములేరి యొడిలోనుంచుకొనెను. వస్త్రముకాలలేదు. క్రొత్తపిడతనొకటి తెప్పించి యందు కామమ్మ భర్తృకాష్టములోని యస్థికలు మున్నె సంతరించియుంచిన అగ్నికణములు జతపఱచి యొకరావికొమ్మ తెప్పించి చితిలోఁబూడ్చివేయించెను. నాలుగవనాఁటి కాకొమ్మ చివురువేసి బెత్తెడుసాగెను. మారయ్యా యస్థికలుగలపిడత నారావికొమ్మకు వ్రేలాడఁగట్టి యిల్లుజేరెను. పౌరులంద తీదృశ్యముగాంచి యాశ్చర్యపరవశులైరి. కామమ్మ గృహములో నొకభాగము శుద్ధిసేసి యచట దర్భపఱచి దానిపై బరుండఁబోవుచు బంధువులను బిలిచిబైటతాళములు నేయుచుండెను.

నేను పిలుచువఱకును దాళములు తెఱువకుఁడని పలికి తాను లోనగొళ్లెములవేసికొనెను. హరిహరి నారాయణాయను నస్పష్టస్వరముమాత్రము బయటనున్నవారలకు వినిపించెను. నిర్జీవప్రతిమవలెఁ గామమ్మ శయ్యపయికొఱఁగెను. తలుపుసందులనుండి బంధువులిదియంతయుఁ గనిపెట్టి యెప్పుడుపిలుచునో యపుడు ద్వారము తెఱచుదమని వంతులవరుసను వాకిలిని గాచుకొనియుండసాగిరి.

౨

కామమ్మ స్థూలదేహము నిర్జీవమయ్యెను. పవిత్రతరమగు నాయమసూక్ష్మదేహము చెన్నపురిజేరి సెంటుజార్జికోటలోనున్న బాలీసు, మేలీసు, పీపీసు అను దొరలకలలోఁ గనిపించి తనవృత్తాంతము భర్తమరణము కాకినాడకలక్టరుదుండగము సహగమనవాంఛ నెఱింగించెను. అట్లే దుబాసియగు నయనప్పమొదలియారికలలోఁగూడఁజెప్పెను. లాడుదొరవారి వస్త్రములకారణముగఁ బచ్చబడసాగెను. రెండుమూఁడుదినములిటులజరుగఁగా నాతఁడు విభ్రాంతుఁడై యిది భూతచేష్టకానోపుననుకొనెను. నాటిరాత్రి కామమ్మకలలోనికివచ్చి "దొరగారూ! నేను దయ్యమునుగాను. మీపెద్దబోయియగు మారయ్యభార్యను. నాపేరుకామమ్మ. మారయ్యమరణించినాఁడు. సహగమనమునకుఁ గాకినాడకలక్టరు సెలవీయక నన్ను అగౌరవించినాఁడు. నన్నేడుదినములు నిర్బంధించినాఁడు. మీసెలవుకొఱకు వచ్చితినని చెప్పుకొనెను. మఱునాఁడు దుబాసియు దొరలందఱుఁగలసి ఫలాహారముగావించుతఱి తమకందఱకువచ్చిన స్వప్నము నందఱుగలియబలుకుకొనిరి. ఇంకను కామమ్మ సత్యము పరిశీలింపవలయునని వారలందఱుతలంచిరి. అప్పుడు లాడుదొర తనలో "నాతమ్ముఁడు మేడీసు దేశాంతరమేగి యాఱుసంవత్సరములు దాటినది. వానిజాడ దెలియుటలేదు. ఎచటనున్నది యెప్పుడువచ్చునది తెలిపినచో నీకు కోరికల సమకూర్తునని" యనుకొని శయనించెను. నాటిరాత్రి లాడుదొరకు స్వప్నములో కామమ్మకనుపించి "నీతమ్ముఁడు శ్రీరంగపట్నమునకుఁబోయి దానిని జయించికైకొనినాఁడు, ఆదివారమునాఁడు ప్రాతఃకాలము నీయొద్దకురాఁగల"డనిచెప్పెను. దొరమిగులనానందించి యాతేదికాగితముపయిువ్రాసికొని సోదరాగమనమునకు నిరీక్షించుచుండెను. నాటిరాత్రి కామమ్మ శ్రీరంగపట్టణములోనున్న మేడీసుకలలోఁగనుపించి మీయన్న లాడుదొర నీకొఱకు విచారపడుచున్నాఁడు. త్వరగఁజెన్నపురికిఁ బయనముకమ్మనిచెప్పెను. మేడీసు మఱునాఁడు శ్రీరంగపట్టణమునుండి బయలుదేరి నియతదినమునకు మదరాసుచేరి తనస్వప్నవృత్తాంతము అన్నకుజెప్పెను. లాడుదొర కామమ్మ యద్భుతచర్యలకానందించి పరుండ కామమ్మ మఱలఁగనిపించి నన్ను కాకినాడకలక్టరు చాలశ్రమపెట్టినాఁడు. ఆ(ఁ)డాటంకపెట్టకుండునటుల హుకుంపంపుమనియు సహగమనకుండమునకు వలయువస్తువులు మూఁడుకొయ్యలతో ఓడగట్టి సముద్రమున వేయవలసినది, నేను సామర్లకోటరేవునకుఁ జేర్చుకొందును, అని చెప్పుకొనెను. లాడుదొర కామమ్మ సత్యవర్తన కానందించి పండ్రెండురేవులవారికి కామమ్మ సహగమనము చేయఁబోవుచున్నది ఆటంకపఱుపవలదని జాబులువ్రాయించెను. కాకినాడకలక్టరునకుఁ బ్రత్యేకించి జాబువ్రాయించెను. లాడుదొర మూఁడుకొయ్యలలో ఓడనేర్పఱచి గుండమునకు వలసినన్ని మంచిగంధపుఁగట్టెలు, పసుపుకుంకుమ, నూనెసిద్దెలు వేయించి సముద్రములోవిడిపించెను. కలాసులేకున్నను ఓడ తెల్లవారుసరికి సామర్లకోట రేవుచేరెను. ఏడుదినములు గడిచినపిదప ఎనిమిదవనాఁడు కామమ్మ లోనిగొళ్ళెములుదీసి బైటనున్నవారితో వాకిలిగొళ్ళెములఁ దీయుమనెను. బంధుమిత్రులు గొళ్ళెములుదీసి కామమ్మనుదర్శించి యానందించిరి. చెన్నపట్టమునుండి దొరలొసంగినయాజ్ఞ గ్రామాధికారి కామమ్మకుఁబంపెను. కాకినాడకలక్టరు అనుమతించెను. సామర్లకోట రేవుచేరిన యోడలోని సామానులు చుట్టపక్కములు తెచ్చి యింటజేర్చిరి. కామమ్మ గృహమువెడలి నునుపు

చిన్నమ్మయను పంచమకాంత సహగమనము జేసినపుణ్యభూమిలో సహగమనకుండము త్రవ్వించెను. స్థలము నకు వెల రెండువరహాలు; త్రవ్విన యుప్పరులకుఁ గట్టుచీరె, కడియాలు, రెండువరహాలుఒసంగెను. గుండ ములో లాడుదొర చుట్టుపట్లవారు పంపినకలపదింపిరి. సహగమనవార్త దేశదేశము లెగఁబ్రాఁకిపోయెను.

౮

కామమ్మ సహగమనము జూడఁదలంచి దేశదేశములనుండి ప్రజలువచ్చిరి. తొటిపాకసీమ, వెలనాడు, పాలనాడు, మన్నెము, గోదావరి పట్టె ప్రాంతమునుండి వేలకొలఁది ప్రజలు వేడుకఁజూడవచ్చిరి. చెన్నపురి నుండి తెల్లదొరలరుదెంచిరి. సహగమనక్షేత్రము ప్రజలతోఁ గ్రిక్కిరిసియుండెను. గుండమునఁ గట్టెలువేసి యగ్నిరగుల్కొల్పిరి. మంగళవాద్యము లఖండముగ మ్రోగుచుండెను. భర్తయస్థికలు గుండమునవేసి తాను దూకఁబోవుసరికి మాదిగవెంకఁడు కామమ్మపైకి ఎఱ్ఱమారినిబ్రయోగించెను. కామమ్మ యది గ్రహించి తెల్లదొరలకుఁ బ్రజలకుఁ జెప్పఁగా వారుపోయి మాదిగగూడెముముట్టడించి వెంకని బట్టుకొనివచ్చి తప్పొప్పించి క్షమాపణముగోరించిరి. కామమ్మ వెంకని విడిచిపెట్టించెను. సహగమనోత్సవమునకు మంచాల వెంకమ్మయను బ్రాహ్మణకాంతవచ్చి జనసందృష్టములో మెడలోనినాను పాఱవేసికొనెను. వెంకమ్మయింటివద్ద అత్తమామలు శిక్షింతురని భయపడి ఈదిక్కుమాలిన వేడుకకురాకున్న నావస్తువు నాకు దక్కుడిదిగదాయని యేడ్వనారంభించెను. కామమ్మ మంచాల వెంకమ్మనోదార్చి అమ్మా బుద్ధిపూర్వకముగఁ బాఱవేసికొని పరులదిట్టిన ఫల మేమియని పలికి యావేడుకచూడవచ్చిన రాజమహేంద్రవరమునివాసియగు ముత్యాల రాజన్నను సమీపించి అయ్యా! రాజన్నా! నేను నీకుఁ జెల్లెలివంటిదానిని. నన్ను నిందలపాలు గావింపకుము. నీకు జమ్మి చెట్టువద్ద దొరికిననాను తిరిగియిమ్ము. కుచ్చెళ్ళలోనున్నమాట విప్పుమనిపలికెను. రాజన్ననివ్వెఱపోయి నాను కామమ్మకీయఁగా నాయమ వెంటనే వెంకమ్మకిచ్చివేసెను. ప్రజలందఱు కామమ్మ మహత్త్వమున కమితానందపరవశులైరి. తప్పుక్షమింపుమని వెంకమ్మ కామమ్మ పాదములపయి వ్రాలఁగా నీకచిరకాలమునఁ గొమారుఁడుదయించును. వానికి మారయ్యయని పేరిడుము. కుమార్తె పుట్టఁగలదు. ఆబిడ్డకు కామమ్మయని పేరిడుమని చెప్పెను.

అనంతరము కామమ్మ తెల్లదొరలను జూచి అయ్యా! నేను సహగమనముచేసిన మూఁడవనాఁడు గుండము పరీక్షించినచో నందు నాభర్తరుమాలు నాచేతిగాజులు బొందుతో మంగళసూత్రము మైజారు మూరెడు చెఱఁగు కాలకయుండును. అందు మొలచిన తామరపూవుదీసి గుండము పూడ్పించి పందిరివేయించి యందుఁ బ్రాతించి పూజాపురస్కారముల కవకాశముగలిగింపుమని కోరెను. దొరలందఱు నందులకంగీకరించి యట్లే చేయుదుమనిరి. కామమ్మ తటాకమునకుఁపోయి స్నానముజేసి మేళతాళములతో రాజవీథినివచ్చుచుండఁ బురవాసులందఱు హారతులొసంగుచు ఫలహారములు నివేదించుచు నాదరించిరి. పెద్దతండ్రి రామన్న యెదురు గావచ్చి కామమ్మను గౌఁగిలించుకొని చిచ్చుఱుకబోవకుమని పలుతెఱంగుల బ్రతిమాలెను. లాభములేక పోయెను. కామమ్మ తనసొమ్ములుదీసి గ్రామస్థులకొసంగి యనంతరము తనయర్చావిగ్రహమునకుఁ బూజలు సాత్వికరీతిగ నొనర్పుమని కట్టడిగావించెను. చూడవచ్చిన ప్రజలందఱకుఁ గామమ్మ నమస్కరించెను. దొరలు సలాములుగావించిరి. భగ్గున మండుచున్న గుండములో మారయ్య యస్థికలువేసి కామమ్మ గుండములో దుమికి జాముసేపు భాషించి పరలోకగతురాలయ్యెను. దొరలు మూఁడవనాఁడు చూఁడగ గుండమున నామె చెప్పినగురుతులు కనిపించెను. దొరలానందించి పందిరులువేయించి చెన్నపురికేగిరి. కాకినాడ కలక్టరున కుద్యోగముపోయెను. కన్నులుపోయెను. అతఁడు సామర్లకోటకువచ్చి కామమ్మ గుండమును సమీపించి

కన్నులు, ఉద్యోగమువచ్చినచో కామమ్మకు మహోత్సవములు చేయింతునని మ్రొక్కుకొనెను. కామమ్మ లాడుదొరస్వప్నములోఁ జెప్పినందునఁ గలక్టరునకు మరలనుద్యోగమువచ్చెను. కనులుగూడవచ్చెను. కృతజ్ఞతా సూచకముగాఁ జేవతాడిచెట్లునఱకించి గొప్పపందిరివేయించి .కలక్టరు యాలయముగట్టించెను. కామమ్మ యనుగ్రహావశమునఁ బాదములుబడసిన పాపయ్య కామమ్మకు ఉత్సవవిగ్రహములు చేయించి తొమ్మిదిదినములు జాగరణము నుహత్తరముగ బ్రాహ్మసమారాధనములుజరిపి పూర్ణిమనాఁడు రథోత్సవముజరిగించెను. పాపయ్య ఆలయముచుట్టు పుష్పవనము ఉద్యానవనమువేయించి యాత్రార్థులకు సౌకర్యములుకలిగించెను. తీర్థప్రజలవలె దేశదేశములనుండి ప్రజలువచ్చి యభిమతలాభములు బడయసాగిరి.

మంచాల వెంకమ్మ గర్భవతియై కుమార్తెను గుమారునిగని కామమ్మకుఁగృతజ్ఞతాసూచకముగఁ దూగుటుయ్యెలచేయించి యాలయమునకు సమర్పించెను. పతివ్రతామతల్లియు, పుణ్యమూర్తియు, గుణవతియునగు కామమ్మ యాడోలికలోనిమ్మపండువలె, అరటిపండువలె, ద్రాక్షపండువలె, మామిడిపండువలె నలరి నాటికి నేటికి నుయ్యాలలూగుచున్నది. సామాన్యగృహమున జనించి త్యాగవశమున ఆంధ్రప్రపంచమున నుప్రసిద్ధురాలైన కామమ్మ దివ్యచరిత్రము వాఙ్మయమున శాశ్వతస్థాయిగఁగవులొనర్చిరి. శిల్పులామెదివ్య రూపమును జిత్రించిరి. గాయకులామెచరిత్రముగానము చేయుచుండిరి. నేఁటికిఁగూడ సామర్లకోట కామమ్మకతన నొకదివ్యక్షేత్రమైనది.

కష్టములకోర్చనేని సౌఖ్యంబుఁగలదు

శ్రీమతి సామినేని హనుమాయమ్మగారు

కాయకష్టంబుగా కఠినజాంగలభూమి
చేఁజేత సరిజేసిచెమటలూఱ
దినమురాత్రులనంగ దెలివిపోనాడుచు
ముచ్చెమ్మటల్ గ్రమ్మ నిచ్చనిల్చి
జూచువారల మది-చోద్యమందిచెలంగ
పంటవలంతిని బాగుజేసి
కర్తదేవుడటంచుఁగని మదిలోనమ్మి
నెమ్మి నద్దానిని నిత్యమరయ

బంఢుధాన్యంబు రత్నంపుపంటవోలె
నరయ లోకసౌఖ్యంబున కాటపట్టు
హాలికప్రవరుండుఁ దా నవనిలోన
కష్టములకోర్చనేని సౌఖ్యంబుఁగలదు.
కన్నులనిద్దురగ్రమ్మి మేనుసెమర్ప
నొకకేల పాత్తముఁబూతలాడ

జననీజనకమనోజనితదుర్ఘటకష్ట
నిష్ఠురోక్తులగుండె నీరుగాగ
నిసుకపాతరపోల్కి నెదగల్గుతలపులు
దామరతంపరై తగిలిముంపఁ
గడకు బి యే బియల్ గాఁ గృతగృత్యుఁడై
పరిపూర్ణధనవృద్ధిప్రౌఢుడగుచు
గన్నవారలు దనుగని నెన్నరాని
సంతసంబునఁదేల సంసారియగుచు

సత్యధర్మాభిరతి నార్తజనులఁబ్రోచు
కష్టములకోర్చనేని సౌఖ్యంబుఁగలదు.
దుష్టత్వముపోనాడి వి
శిష్టపథంబునను సమతచే భూతాళిన్
తుష్టుఁడై మనుప బూనెను
కష్టంబునగల్గుసుఖము ఘనపుణ్యులకున్.